నమస్తే తెలంగాణ
పెద్దపల్లి
5 | కరీంనగర్, గురువారం 28 మార్చి 2024 | PEDDAPALLI

మోటర్లు కాలుతున్నయ్

- వినోద్‌కుమార్‌తో వైండింగ్ షాప్ యజమాని శ్రీనివాస్

వీణవంక, మార్చి 27: కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు కరెంట్ మంచిగ ఉండడం వల్ల మోటర్లు కాలక పోయేది. కానీ, మొన్నటి సంది మోటర్లు చాలా కాలిపోయి రిపేర్‌కు వస్తున్నయని వీణవంకకు చెందిన వైండింగ్ షాప్ యజమాని శ్రీనివాస్ పేర్కొన్నాడు. వీణవంకలో ఓ కార్యక్రమానికి కరీంనగర్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై, తిరుగుపయనంలో బస్టాండ్ సమీపంలో షాపులో మోటర్ వైండింగ్ చేస్తున్న శ్రీనివాస్‌ను చూసి ఆగారు. అక్కడకు వెళ్లి మాట్లాడారు. గతంలో మోటర్లు ఎన్ని కాలేది? కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎన్ని కాలుతూ రిపేర్‌కు వస్తున్నయ్? అని అడుగగా, శ్రీనివాస్‌పై విధంగా సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పారు. కాంగ్రెస్‌కు ఓటు వేయడం వల్ల అన్ని వర్గాల ప్రజలు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

వీణవంకలో మోటర్ వైండింగ్ షాప్ యజమాని శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న కరీంనగర్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి, వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

మార్పు అంటే గోసపెట్టుడు కాదు

- ఆడబిడ్డలు, రైతులను ఏడ్పించుడు కాదు • కేసీఆర్ పాలనలో ఈ పరిస్థితి లేదు • కాంగ్రెస్ పాలనలో లోపమే శాపం
- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: మార్పు అంటే గోసపెట్టుడు కాదని, ఆడబిడ్డలు, రైతులు ఏడ్పించుడు కాదని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ మండిపడ్డారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో ఎన్నడూ ఈ పరిస్థితిని చూడలేదని చెప్పారు. మార్పు అంటే మంచి జరగాలని, కానీ, చెడువైపు వెళ్తున్నదని విమర్శించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని గ్రామాల్లో తిరుగుతుంటే ప్రజలు బోరున విలపిస్తున్న పరిస్థితిని చూస్తున్నానని ఆవేదన చెందారు. ఆర్బీఐ మంగళవారం ప్రకటించిన జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని, అందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆరే కారణమని ప్రశంసించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ఇప్పుడు అప్పుల తెలంగాణ, తెలంగాణ దివాలా తీసిందని అనగలరా..? అని ప్రశ్నించారు. ఎల్లారెడ్డిపేటలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు తమ పాలనకు రెఫరెండం అని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నప్పటికీ గ్రామా ల్లో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో లేని విధంగా కరెంట్, సాగునీటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయని వాపోయారు. మోటర్లు కాలిపోతుండడంతో వైండింగ్ షాపులు మళ్లీ తెరుచుకుంటున్నాయన్నారు. బావుల్లో పూడికలు తీసే క్రేన్‌లు ఎట్లుంటయో ఈతరం పిల్లలకు తెలియదని కానీ, ఇప్పుడు క్రేన్లను చూసే దుస్థితి వచ్చిందన్నారు. బ్యాంకు అధికారులు రైతులకు నోటీసులు జారీ చేస్తున్నారని, బంగారం అమ్మి రుణాలు కట్టాలని ఒత్తిడి తెస్తున్నారని మండిపడ్డారు. సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా రూ.2లక్షలు రుణమాఫీ చేస్తానని, ఇంకా ఎవరైనా తీసుకోనివారుంటే రుణం తీసుకోవాలని రేవంత్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం క్వింటాల్‌కు ₹500 బోనస్ ఇస్తామన్న మాట కూడా నెరవేరలేదని, ఉచిత బస్సు మినహా ఆరు గ్యారెంటీల్లో ఏ గ్యారెంటీ సరిగా అమలు కాలేదని దుయ్యబట్టారు. ₹500కే సిలిండర్ ఉచిత పథకంలా కాకుండా ఉద్దెర పథకంలా మారిందని, ₹970 కట్టి సిలిండర్ బుక్ చేస్తే తర్వాత తాము చెల్లిస్తామని అనడం తెలంగాణ ఆడబిడ్డల వద్ద ఉద్దెర పెట్టినట్లు ఉన్నదని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో లోపమే రైతులకు శాపంలా మారిందని మండిపడ్డారు. మేడిగడ్డ నుంచి రోజుకు ఐదు వేల క్యూసెక్కుల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయని, అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటినా చూస్తూనే ఉన్నారని, కాపర్‌డ్యాం కట్టి ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నింపి పంటలకు నీళ్లెందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నా పంటకు మద్దతు ధరతో పాటు అదనంగా బోనస్ ఇస్తున్నరా..? లేదా అనే విషయాన్ని ఇంకా చెప్పడం లేదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు తుల ఉమ, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, రాష్ట్ర నాయకులు గూడూరి ప్రవీణ్, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్ రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ వర్సకృష్ణహరి, ఎంపీటీసీ ఎన్గందుల అనసూయ, నాయకులు అందె సుభాష్, పిల్లి కిషన్ పాల్గొన్నారు.

దివ్యాంగుల నైపుణ్య, ఉపాధికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 27: జిల్లాలోని దివ్యాంగులకు నైపుణ్య, ఉపాధి అవకాశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు, జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వతి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీఎం దక్ష్ డిపెవ్‌డ్ అనే డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా ఉచిత నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి చూపుతామని పేర్కొన్నారు. ఔత్సాహికులుwww.pmdaksh.depwd.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

నేడు, రేపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 27: జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థుల ఉద్యోగ సాధనకు ఉచిత శిక్షణ కోసం ఔత్సాహిక అభ్యర్థుల సర్టిఫికెట్లు గురు, శుక్రవారాల్లో వెరిఫికేషన్ చేస్తామని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకుడు పీ నతానియేల్ తెలిపారు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన ఎస్సీ అభ్యర్థులు ఎస్సెస్సీ మార్కుల మెమో, డిగ్రీ మార్కుల మెమో, ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌లు రెండు సెట్లతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని కలెక్టరేట్ రోడ్డులో గల అంబేద్కర్ భవనంలోని టీఎస్ స్టడీ సర్కిల్‌లో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9885218053, 9573401227, 9177605511 నంబర్లలో సంప్రదించాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు.

- ఎండపూట మస్తు గిరాకీ

కరీంనగర్‌లోని ఓ షాపులో ఫ్యాన్‌ను రిపేర్ చేస్తున్న ఎలక్ట్రీషియన్

ఇన్నాళ్లు వెలవెలబోయిన ఫ్యాన్ మరమ్మతు షాపులు కొద్దిరోజులుగా కళకళలాడుతున్నాయి. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో నాణ్యమైన కరెంట్‌తో ఎక్కడా సమస్యలు రాకపోవడంతో దుకాణాలన్నీ మూతపడగా, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో మళ్లీ తెరుచుకుంటున్నాయి. నడి వేసవి రావడం, విద్యుత్ లోవోల్టేజీతో ఇండ్లలో ఫ్యాన్లు కాలిపోతుండగా, ఎలక్ట్రీషియన్లకు గిరాకీ పెరిగింది. కరీంనగరంలో ఏ షాపు చూసినా జనంతో రద్దీగానే కనిపిస్తున్నది.

- కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఫ్రీ సరే.. సరిపడా బస్సులేవి?

తెలంగాణచౌక్, మార్చి 27: ఆర్టీసీ బస్సులు ఫుల్ అయిపోతున్నాయి. దూర ప్రాంత ప్రయాణికులకు ప్లేసే దొరకడం లేదు. మహాలక్ష్మి పథకంతో మహిళలకు బస్సు ఫ్రీ చేసిన ప్రభుత్వం, రద్దీ రూట్లలో అదనపు బస్సులు నడపకపోవడంతో ఇబ్బందిగా మారింది. బస్సుల్లో ప్రయాణికులు కనీసం నిల్చునేందుకు సైతం జాగ లేకపోవడంతో ప్రమాదకరమని తెలిసినా ఫుట్ బోర్డుపై కూర్చొని ప్రయాణిస్తున్నారు. ఇందుకు కరీంనగర్-వరంగల్ ఎక్స్‌ప్రెస్ రూట్ బస్సులే నిదర్శనంగా నిలుస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రూట్‌లో ప్రయాణికులకు సరిపడా అధికారులు బస్సులు నడపడం లేదు. బుధవారం కరీంనగర్ నుంచి వరంగల్ వెళ్లే బస్సులో నిల్చునేందుకు కూడా జాగ లేకపోవడంతో ఓ మహిళ ఇలా.. ఫుట్‌బోర్డుపై కూర్చొని ప్రయాణించడం పరిస్థితికి అద్దంపడుతున్నది.

బస్సులో ఫుట్ బోర్డు మెట్లపై కూర్చొని ప్రయాణిస్తున్న మహిళ

కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ శివారులో ఎండిన వరి పొలంలో దిగాలుగా కూర్చున్న రైతు

పాతాళానికి జలం

- నిరుడు ఇదే సమయానికి పుష్కలంగా నీళ్లు
- ఎటు చూసినా పసిడి పంటలు
- ఇప్పుడు కరువు ఛాయలు
- పడిపోతున్న భూగర్భ జలాలు
- వట్టిపోతున్న బావులు, బోర్లు
- వెలవెలబోతున్న చెరువులు, కుంటలు
- అడుగంటుతున్న ప్రాజెక్టులు
- సాగునీరు లేక ఎండుతున్న పొలాలు
- ఆందోళనలో అన్నదాతలు

బావిలో అడుగంటిన నీరు

ఉమ్మడి జిల్లాపై కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయి. భూగర్భ జలాలు రోజురోజుకూ పాతాళానికి చేరుతున్నాయి. కరీంనగర్ జిల్లాలో నెల వ్యవధిలోనే సగటున 1.23 మీటర్ల లోతుకు పడిపోయాయి. దాదాపు అంతటా ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. నిరుటిదాకా మండు వేసవిలో సైతం నిండుకుండల్లా మత్తళ్లు దుంకిన చెరువులు, కుంటలు ఇప్పుడు వెలవెలబోతున్నాయి. ప్రాజెక్టులు సైతం అడుగంటుతున్నాయి. వ్యవసాయ బావులు, బోర్లు వట్టిపోతున్నాయి. తాగునీటికి సైతం కష్టాలు మొదలయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. యాసంగి పంటలు చేతికి వచ్చే సమయంలో ఎండిపోతుండగా, రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీరిచ్చి పంటలను కాపాడాలని వేడుకుంటూ రైతులు రోడ్డెక్కుతున్నారు.

గంగాధర మండలం కుర్మపల్లిలో పూడికతీత

కరీంనగర్, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ పాలనలో ఎటు చూసినా జలాలు పరుగులు తీశాయి. నిరుడు నిండువేసవిలో కూడా చెరువులు, కుంటలు మత్తళ్లు దుంకాయి. ప్రాజెక్టు కాలువల ద్వారా పుష్కలంగా నీళ్లు అందాయి. తద్వారా భూగర్భ జలాలు పడిపోకుండా స్థిరంగా ఉన్నాయి. బావులు, బోర్లదైన కూడా ఆధారపడి సాగు చేయగా, బంగారు పంటలు పండాయి. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎక్కడ చూసినా కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. రోజురోజుకూ భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయి. పోయినేడు మేలో 7.37 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా, ఈ యేడాది ఫిబ్రవరిలోనే దుర్భర స్థితి ఎదురైంది. భూగర్భ జలశాఖ అధికారుల నివేదిక ప్రకారం.. గత నెలలో 7.57 మీటర్ల లోతుకు పడిపోయాయి. దీన్ని చూస్తే ఈసారి పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి మధ్యలో కూడా భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నట్లు అధికారుల నివేదికలు చెబుతున్నాయి. జనవరిలో సగటున 6.34 మీటర్లు ఉన్న భూగర్భ జలం ఫిబ్రవరిలో 7.57 మీటర్లకు పడిపోయింది. అంటే నెల వ్యవధిలో సగటున 1.23 మీటర్లకు తగ్గిపోయింది. దాదాపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. ఎక్కడ చూసినా భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతున్నాయి. ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు అడుగంటి పోతున్నాయి. ఎస్సారెస్పీ, ఎల్ఎండీలో నీటిమట్టం పూర్తిగా పడిపోతున్నది. ఎల్ఎండీలో 5.101 టీఎంసీ మాత్రమే నీరున్నది. మధ్య మానేరు ద్వారా నీటిని విడుదల చేస్తున్నా.. ఈ జలాశయంలో కూడా ఆశించిన నీరు లేదు. ఈ పరిస్థితుల్లో సాగునీటి కోసం తండ్లాడాల్సి వస్తున్నది. ప్రధానంగా మెట్ట ప్రాంతంలో పరిస్థితి చాలా దారుణంగా ఉన్నది. నాడు పచ్చగా కనిపించిన భూములు నేడు నెర్రెలు వారుతున్నాయి. ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతున్నాయి.

ఆందోళనలో రైతులు

పదేళ్లుగా ఏ రందీ లేకుండా సంబురంగా సాగు చేసిన రైతులు, ఈ యాసంగిలో ఊహించని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు నీళ్లిస్తామని చెప్పినా.. ఇప్పుడు ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కాలువల ద్వారా నీళ్లు రాక భూగర్భ జలాలపైనే ఆధారపడుతున్నారు. అయితే భూగర్భ జలాలు వేగంగా పాతాళానికి పడిపోతుండగా.. పంటలను కాపాడుకునేందుకు అరిగోస పడుతున్నారు. కొందరు ట్యాంకర్లు, ఇతర ప్రాంతాలను నీటిని తెచ్చేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. వ్యవసాయ బావుల్లో పూటిక తీయిస్తున్నారు. మరికొందరు ఎండుతున్న పంటలను చూసి కన్నీరు పెడుతున్నారు. పంటలు చేతికి వచ్చే సమయంలో నీటికి కటకట ఏర్పడడంతో గుండె మండి రోడ్డెక్కుతున్నారు. కాలువల ద్వారా సాగు ఇవ్వాలని ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. మార్చిలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే మరో నెల రోజులు ఎలా గట్టెక్కేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే వేలాది ఎకరాల్లో పంటలు ఎండి పోయాయని, పెట్టిన పెట్టుబడులు నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

భూగర్భ జలాల వివరాలు మీటర్లలో..

మండలం	జనవరి	ఫిబ్రవరి	వ్యత్యాసం
చిగురుమామిడి	9,96	10.02	0.06
చొప్పదండి	9.41	11.65	2.24
ఇల్లందకుంట	4.32	6.35	2.03
గంగాధర	14.34	15.73	1.39
గన్నేరువరం	8.05	8.43	0.38
హుజూరాబాద్	5.92	7.71	0.81
జమ్మికుంట	3.80	3.32	0.48
కరీంనగర్	6.64	7.45	0.81
కరీంనగర్‌రూరల్	2.75	3.09	0.34
కొత్తపల్లి	6.93	10.65	3.72
శంకరపట్నం	5.85	5.14	0.71
మానకొండూర్	2.15	3.86	1.71
రామడుగు	7.99	9.84	1.85
సైదాపూర్	3.98	6.01	2.03
తిమ్మాపూర్	5.62	7.81	2.19
వీణవంక	3.78	4.13	0.35
సగటున	6.34	7.57	1.23

కాంగ్రెస్‌ది అంతా మోసమే

- మూడు నెలల పాలనలోనే ముప్పు తిప్పలు
- సాగునీటి నిర్వహణలో ఘోరంగా విఫలం
- పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేలు చెల్లించాలి
- పెద్దపల్లి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- పెద్దపల్లి మండలంలో ఎండిన పంటల పరిశీలన

చీకురాయి శివారులోని పొలంలో రైతు ఆకుల వెంకటేశ్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, చందర్

పెద్దపల్లిరూరల్, మార్చి 27: 'కాంగ్రెస్ ఎన్నికల ముందు చెప్పినవన్నీ అబద్ధాలే. అంతా మోసమే. దొంగ హామీలతో రైతులను ముంచి గద్దెనెక్కింది. సాగునీటి నిర్వహణలో ఘోరంగా విఫలమై, పంటలు ఎండబెడుతూ రైతన్న పొట్టకొడుతున్నది' అని పెద్దపల్లి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. సాగునీరందక ఎండిన పంటలకు గాను ఎకరానికి ₹25 వేలు చెల్లించి ఆదుకోవాలని, అదే డిమాండ్‌తో ఈ నెల 30, 31వ తేదీల్లో జిల్లా కేంద్రాల్లో రైతు దీక్షను చేస్తున్నామని వెల్లడించారు. పెద్దపల్లి మండలం భోజన్నపేట, చీకురాయి గ్రామాల శివారులో బుధవారం సాగునీరందక ఎండిన పొలాలలను మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేసీఆర్ పాలనలో రైతులకు ఏనాడూ సాగునీటి కష్టాలు రానివ్వలేదని, ఎక్కడా ఒక్క ఎకరం ఎండిపోకుండా నీరందించారని కొనియాడారు. ఎక్కడ చూసినా పంటలు బాగా పండాయని, సాగు బంగారమైందని చెప్పారు. కానీ, కాంగ్రెస్ మూడు నెలల పాలనలో ముప్పుతిప్పలు తెచ్చిపెట్టిందని మండిపడ్డారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి యాసంగి పంటలకు నీరందించే సోయి లేదని విమర్శించారు. నష్టపోయిన రైతులు మనోధైర్యం కోల్పోవద్దని, మొదటి నుంచి అండగా ఉన్న బీఆర్ఎస్‌ను ఈ ఎన్నికల్లో గెలిపించుకోవాలని కోరారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, డైరెక్టర్లు మేకల కుమార్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జీ రఘువీర్‌సింగ్, ఆవుల రాజకిషన్ యాదవ్, తీగల సదయ్య, ధర్మపురి, ఉప్పు రాజ్‌కుమార్ ఉన్నారు.

మేలైన రకాలను ఎంచుకోవాలి

- డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీ రఘురాంరెడ్డి
- పొలాసలో ఉత్తర తెలంగాణ మండల పరిశోధన, విస్తరణ సలహా సమావేశం

పొలాసలో బ్రోచర్లను ఆవిష్కరిస్తున్నశాస్త్రవేత్తలు

జగిత్యాల టౌన్, మార్చి 27: వాతావరణ అనుకూల, మేలైన రకాలను మాత్రమే ఎంచుకొని పంటలు సాగు చేయాలని ఉత్తర తెలంగాణ మండల రైతులకు డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీ రఘురాంరెడ్డి సూచించారు. బుధవారం పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఉత్తర తెలంగాణ మండల పరిశోధన, విస్తరణ సలహా సంఘ సమావేశాన్ని సంచాలకులు డాక్టర్ సుధారాణి, అనుబంధ శాఖల అధికారులతో కలిసి నిర్వహించి, మాట్లాడారు. రైతులు సరైన శాస్త్రీయ, సాంకేతిక యాజమాన్య పద్ధతులను పాటించడం వల్ల అనుకున్న దానికంటే ఎక్కువ దిగుబడులు సాధించవచ్చన్నారు. ఒక్క వరి పంటపైనే ఆధారపకుండా ఇతర రకాలను కూడా ఎంచుకుంటేనే అధిక ఆదాయాన్ని పొందవచ్చన్నారు. పరిశోధన స్థానం ద్వారా ఇచ్చే సూచనలు, సలహాలు రైతులు పాటించాలని, అప్పుడే పంట నష్టం జరుగకుండా కాపాడుకోవచ్చన్నారు. పురుగు మందులను ఎక్కువ మోతాదులో వాడవద్దని సూచించారు. పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం సంచాలకులు డాక్టర్ జీ శ్రీనివాస్ మాట్లాడారు. గతేడాది వరి, చెరుకు, పత్తి, సోయా చిక్కుడు, శనగపై చేసిన పరిశోధనలను రైతులకు వివరించారు. అనంతరం రైతుల సందేహాలను ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జీ మంజులత నివృత్తి చేశారు. ఆదిలాబాద్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ విస్తరణకు సంబంధించిన ఫలితాలను రైతులకు వివరించారు. ఉత్తర తెలంగాణలో ఉన్న 10 జిల్లాల వ్యవసాయ అధికారులు వారి జిల్లాల్లో ఉన్న పంటలు, ఎదురైన సమస్యలను, చిరుసంచుల దశలో ఉన్న వివిధ రకాల పంటల రకాల ఫలితాలను ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. కార్యక్రమంలో సుమారు 250 మంది రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, అనుబంధ శాఖల అదికారులు, యూనివర్సిటీ ప్రధాన శాస్త్రవేత్తలు, యూనివర్సిటీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో గందరగోళం

- పెద్దపల్లి జిల్లాలో ఐదుగురు ఇన్‌చార్జి ఎంఈవోలు
- ఇష్టారాజ్యంగా ఇన్‌చార్జి బాధ్యతలు
- పాఠశాలలపై కొరవడుతున్న పర్యవేక్షణ
- ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు

పెద్దపల్లి జిల్లా విద్యాశాఖలో గందరగోళం నెలకొన్నది. 14 మండలాలకు గానూ ఐదుగురు ఇన్‌చార్జి ఎంఈవోలు ఉండగా.. ఆపై అదనపు బాధ్యతలతో పర్యవేక్షణ కొరవడుతున్నది. హైస్కూల్ హెడ్మాస్టర్లకే ఫుల్ అడిషనల్ చార్జి ఇస్తుండడం, దూరంగా ఉండే మండలాలు కేటాయిస్తుండడంతో చదువు గాడితప్పుతున్నది. దీనిపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతోనే అయోమయ పరిస్థితులు నెలకొన్నాయని విమర్శిస్తున్నారు.

పెద్దపల్లి, మార్చి 27(నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లాలో 14 మండలాల విద్యాశాఖ అధికారుల బాధ్యతలను ఆరుగురు జడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలకు అప్పగించారు. ధర్మారం హెచ్ఎం చాయాదేవికి కేవలం ధర్మారం.. మంథని మండలం గుంజపడుగు హెచ్ఎం లక్ష్మికి మంథని, ముత్తారం.. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి హెచ్ఎం కవితకు ఎలిగేడు, జూలపల్లి మండల విద్యాధికారులుగా ఫుల్ అడిషనల్ చార్జి (ఎఫ్ఏసీ) బాధ్యతలను ఇచ్చారు. కమాన్‌పూర్ హెచ్ఎం సంపత్‌రావు కమాన్‌పూర్, రామగిరి, రామగుండం, పాలకుర్తి, అంతర్గాం.. పెద్దపల్లి హెచ్ఎం సురేందర్ కుమార్ పెద్దపల్లి, సుల్తానాబాద్, శ్రీరాంపూర్.. సుల్తానాబాద్ మండలం కనుకుల హెచ్ఎం రాజయ్య ఓదెల మండల ఇన్‌చార్జిగా ఉన్నారు. కాగా, కమాన్‌పూర్ ఎంఈవోగా ఉన్న సంపత్‌రావు ఈ నెల 31 రిటైర్డ్ కానుండగా, ఆయన పరిధిలోని కమాన్‌పూర్, రామగిరి మండలాలను పెద్దపల్లి ఎంఈవోగా కొనసాగుతున్న సురేందర్ కుమార్‌కు కేటాయించారు. మిగిలిన రామగుండం, పాలకుర్తి, అంతర్గాం మండలాలను ఓదెల ఎంఈవో రాజయ్యకు కేటాయించారు. అయితే ఇన్‌చార్జిల కేటాయింపులో ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలే ఇన్‌చార్జిలుగా ఉన్న ఎంఈవోలకు పక్కన ఉండే మండలాలకు కాకుండా దూరంలో ఉండే మండలాల బాధ్యతలను కట్టబెట్టడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఉదాహరణకు చూస్తే రామగుండం, పాలకుర్తి, అంతర్గాం మండలాలను పక్కనే ఉన్న మంథని, పెద్దపల్లి ఎంఈవోలకు ఇవ్వకుండా దాదాపుగా 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓదెల ఎంఈవోకు ఇచ్చారు. అలాగే సుల్తానాబాద్ మండలం నుంచి ఇన్‌చార్జి ఎంఈవోలుగా ఉన్న ఇద్దరు హెచ్ఎంలకు.. సుల్తానాబాద్ మండలం కేటాయించకుండా, పెద్దపల్లి ఇన్‌చార్జి ఎంఈవోకు బాధ్యతలు కేటాయించారు. ఇలా ఇష్టారాజ్యంగా కేటాయించడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడుతున్నది. దూరభారంతో సమయం కూడా వృథా అవుతున్నది. దీంతో ఎటూ న్యాయం చేయలేని పరిస్థితి ఉంటున్నది.

నిబంధనల మేరకే బాధ్యతలు

ప్రభుత్వ నిబంధనల మేరకే ఎంఈవోలకు బాధ్యతలు ఇచ్చాం. గతంలో జూలపల్లిలో హెచ్ఎంగా పనిచేసిన కవిత సుల్తానాబాద్ మండలానికి వచ్చింది. ఆమె సుల్తానాబాద్‌లో పనిచేస్తూ జూలపల్లి, ఎలిగేడు మండలాలను చూడాల్సి వస్తున్నది. ఇప్పుడు అది మార్చేందుకు వీలు లేదు. అలాగే మంథని ఎంఈవోకు ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా అదనంగా సమీప మండలాలను ఇవ్వలేదు. పెద్దపల్లి ఎంఈవో సురేందర్‌కుమార్ కొత్తగా మండలాలను తీసుకునేందుకు విల్లింగ్ ఇవ్వలేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే బాధ్యతల కేటాయింపులో ఎదురైన సమస్యలు పరిష్కరిస్తాం.

-మాధవి, డీఈవో (పెద్దపల్లి)